కథ

# దరిద్రులు

– ఇలపావులూరి మురళీమోహనరావు

**''ఛీ..ఛీ... ఇంత దరిద్రంగా కుక్కలు కూడా బ్రతకటం లేదు. మమ్మల్ని ఇలా మలమల మాడ్చి చంపే కన్నా ఇంత విషం తీసుకుని మాక్కూడా ఇవ్వరాదూ?'' సునీత మాటలు చెవుల్లో ప్రతి ధ్వనిస్తున్నాయి.**

**వే**గంగా నడుస్తున్నాను. గమ్యం ఎక్కడికో తెలీదు. నాలాంటి దరిద్రుడికి ఈ భూమ్మీద బ్రతికే హక్కులేదు. చావాల్సిందే బ్రతికి ఏం సాధించాలి! ఎన్నాళ్ళున్నా గొర్రె తోక జీతం. చాలీచాలని తిండి. వంటినిండా కప్పుకోవడానికి పెళ్ళానికి మంచి చీరె లేదు. సాటి పిల్లలందరూ రంగు రంగుల బ్యాగుల్లో పుస్తకాలు సర్దుకుని చిన్ని చిన్ని సైకిళ్ళ మీద, ఆటోలలో ఆడుతూ పాడుతూ చేతుల్లో ఫైవ్ స్టార్ చాక్లెట్లు పట్టుకుని చలాకీగా స్కూళ్ళకు వెళ్తుంటే తన పిల్లలు కనీసం ఇస్త్రీ కూడా లేని బట్టలేసుకుని బియ్యపు బస్తాల్లాంటి బ్యాగులను బాల క్రీస్తుల్లా మోస్తూ బేలగా నడిచి వెళ్తుంటే దుఃఖాన్నీ దిగమింగడం తప్ప ఏం చేయలేని నిస్సహాయత.

పేరుకు గవర్నమెంటుద్యోగం. పెరుగుతున్న ఖర్చులకు ఏ మాత్రం పొంతన లేని జీతాలు. లంచాలు తీసుకోవాలంటే భయం! నిజాయితీ అనే అందమైన ముసుగుతో భయాన్ని కప్పి పుచ్చుతాను.

ఎన్ని సరుకులు తెచ్చినా ఏదో ఒకదానికి లోటు! ఈ తిండికి ఎంత డబ్బూ చాలదు. 'పెళ్ళై ఇన్నేళ్లయినా ఒక్క సరదా లేదు. ఓ సినిమాలేదు. ఓ షికారు లేదు. నీకిచ్చి మా నాన్న నా గొంతు కోశాడు.' భార్య సాధింపు. అసలే డబ్బు కోసం నానా ఇబ్బందులు పడుతుంటే ఇలాంటి సూటి పోటి మాటలు కట్టుకున్న పెళ్ళాం నుంచే వింటుంటే ఏ మగాడికైనా వళ్లు మండుతుంది. పడేసి నాలుగు తంతాడు. ఎంతైనా అబల కదా! తన్నులు తింటుంది. నాలుగురోజులు సాధిస్తూనే ఉంటుంది. ఏదో ఒక ముహూర్తంలో రాజీ కుదురుతుంది. రెండు రోజులు తరువాత మళ్ళీ మామూలే! అబ్బబ్బ... నరక ప్రాయం సంసారం.

పుట్టిన రోజుకు మంచి చీర కొని పెట్టమని అడిగింది. మంచి చీరంటే మాటలేనా? ఐదారు వందలైనా కావాలి. ఏవి? ఆ మాటే అంటే తగాదా మొదలైంది. ఛి ఛీ... ఇది పెళ్లాం కాదు. పిశాచి!

''నేనేమైనా మణులు మాణిక్యాలు కోరానా? వజ్రాల నగలు దిగెయ్యమన్నానా? ముష్టిచీర ఒకటి అడిగాను. పెళ్లైన ఈ పదేళ్లలో ఎన్ని చీరెలు కొన్నారు? బయట ఊళ్లు చూపించ లేకపోతే పోయారు. కనీసం ఊళ్లో ఉన్న టాంక్‌బండ్‌కు తీసికెళ్లారా? ఒక్కపూట సరదాగా ఒక రెస్టారెంట్‌కు తీసికెళ్లి భోజనం పెట్టించారా? పిల్లలకు ఒక్క ఐస్‌క్రీమ్ ఇప్పించారా? పిల్లలకు ఒక్క మంచి డ్రెస్ కొని పెట్టారా? ఎందుకీ వెధవ బ్రతుకు? జీవితాంతం ఇలా అన్నిటికి మొహం వాచి పోవలసిందేనా?'' అన్నది.

నాకు మండి పోయింది.

''మీ అందరికీ పెట్టకుండా నేనొక్కడినే జల్సాలు చేస్తున్నానా? తాగి తందనాలాడుతున్నానా? ముండల వెంట తిరుగుతున్నానా? మీకు తెలియకుండా డబ్బులు దాచుకుంటున్నానా? వచ్చిన జీతం వచ్చినట్లే నీకిస్తున్నాను కదా! వచ్చింది చాలక అప్పులు కూడా చేస్తున్నాను కదా! నేనేం చేసేది? సంపాదనను బట్టి సర్దుకోవాలన్న ఇంగితం కూడా లేదేం?'' అరిచాను.

''హు... నీ మొహానికి ముండల సోకు కూడా! ఇంత నీచపు బ్రతుకు కుక్కలు కూడా బ్రతకడం లేదు. జీవితాంతం మమ్మల్నిలా హింసించే బదులు ఇంత విషం తీసుకుని మా నోట్లో కూడా నాలుగు చుక్కలు వెయ్యరాదూ?'' శోకాలు పెడ్తూ అన్నది.

జీవితం మీద విరక్తి పుట్టింది. భర్త మనసును అర్థం చేసుకోలేని భార్య కంటే మగాడికి మరో శాపం లేదు. ఇటువంటి దాంతో మరో నలభై ఏళ్లు జీవించే కంటే ఈ దరిద్రం నుంచి శాశ్వత విముక్తి పొందడమే మేలు.

నెల నెలా ఏడు వేలు జీతం వస్తుంది. బొటాబొటీగా సరిపోతుంది. ఎంత జాగ్రత్త పడినా నెలాఖర్లో అప్పులు చెయ్యక తప్పడం లేదు. పెళ్లి కాకముందు ఎన్నో రంగుల కలలు కన్నాను. ప్రాక్టికల్ లైఫ్‌లో అవన్నీ భగ్నమయ్యాయి. ఈ దరిద్రం ఒక నాటిది కాదు. ఎన్నాళ్లు ఎదురు చూసినా ఎటు నుంచీ కలిసి వచ్చే అవకాశం ఏదీలేదు. ఆస్తి పాస్తులు లేవు. ప్రమోషన్లు రావు. నా అంత దరిద్రుడు ఈ ప్రపంచంలో ఉండడు. ఉండబోడు.

చావాలి. కానీ ఎలా? బస్సు కింద పడితే! అమ్మో! ఒకవేళ చావక కాళ్లో చేతులో విరిగితే! వద్దు వద్దు. ఆ ఊహే భయంకరం! ఎదురుగా వస్తున్న బస్సును చూసి గభాల్న పక్కకు తప్పుకున్నాను.

నడుస్తూనే ఆలోచిస్తున్నాను. రోడ్డుకు రెండు వైపులా ఇంద్ర భవనాలను మరపించే భవనాలు! అబ్బ... ఇంతింత డబ్బు ఎలా వస్తుందో వీళ్లకు! ఒక చిన్న రేకుల పంచ వేద్దామంటే చేతిలో పైసా ఉండదు తనకు. అందరి ఇళ్ల ముందు ఐరావతాల్లా పెద్ద పెద్ద కార్లు! ఒక మోపెడ్ కొందామని ఆరు నెలలు ఆలోచించి చివరకు విరమించుకున్నాను.

నా ఆలోచనలకు నాకే ఆశ్చర్యం వేసింది. ఒక వంక చావాలని వెళ్తూ మళ్లీ ఈ ఆలోచనలేమిటి?

హుస్సేన్ సాగర్లో దూకితే! ప్రాణం ఎంత సేపట్లో పోతుంది? ఊపిరాడనంత వరకూ నీళ్లు మింగాలి. అబ్బో! ఆ నీళ్లు పరమ కంపు! వాసన చూడటానికే ప్రాణమొప్పని ఆ నీళ్లను తాగేదెలా? అమ్మో... అంత ఘోరంగా చావలేను.

''హలో...'' అని వినిపించింది. తలపైకెత్తి చూశాను. ఎదురింట మేడ మీద ఒక పెద్దాయన చప్పట్లు కొడుతూ పిలుస్తున్నాడు.

ఆయన మా ఆఫీసులో ఛీఫ్ ఇంజనీర్‌గా పని చేసి ఇరవై సంవత్సరాల క్రితం రిటైరైనాడు. ఏవేవో పైరవీలంటూ అపుడపుడు మా ఆఫీసుకు వస్తుంటాడు. సర్వీస్‌లో కాంట్రాక్టర్లని జలగలా పీడించి కోట్ల రూపాయలు కూడ బెట్టాడు. పాతిక లక్షలు పెట్టి లంకంత ఇల్లు కట్టించాడు. పిల్లలందరూ అమెరికాలో స్థిరపడ్డారు. భార్యా భర్త లిద్దరూ అప్ స్టెయిర్లో ఉంటూ క్రింద భాగం నాలుగు పోర్షన్లు చేసి అద్దెలకిచ్చారు. వెనుక పక్క మళ్లీ ఏదో కట్టిస్తున్నాడు.

''రండి రండి మూర్తి గారూ'' అన్నాడాయన.

చేసేదిలేక లోపలకు వెళ్లాను. కూర్చున్నాను.

''మొన్న ఆఫీసులో మీకు కొన్ని డాక్యుమెంట్సిచ్చాను. కొంచెం ఆ పని చేసి పెట్టండి. మీకు పుణ్యం ఉంటుంది'' అన్నాడు ఇంజినీరు.

మనస్సులో నవ్వుకున్నాను. మరో గంటలో నేను ఈ లోకం నుంచే వెళ్లిపోతున్నానని తెలియదు పాపం! అనుకున్నాను.

''ఏదో కన్‌స్ట్రక్షన్ జరుగుతున్నట్లుంది!'' అడిగాను.

''అవును. ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళ

అమెరికాలో స్థిరపడిపోయారు. వారి పిల్లలు కూడా అక్కడే ఉద్యోగాలు సంపాదించుకున్నారు. ఒక్కొక్కరికి నెలకు ఇరవై లక్షల దాకా ఆదాయం ఉన్నది. మా ఇద్దరిని కూడా అక్కడికే రమ్మని పోరు పెడుతున్నారు. డబ్బున్నంత మాత్రాన సుఖముంటుందా మూర్తి గారూ. ఈ గాలి, ఈ వాతావరణం... ఈ నేల వాసన... ఇక్కడి తిండి అక్కడుంటుందా? ఎనభైలో పడ్డాను. అక్కడికెళ్లి ఏం చేయ్యాలి?'' అన్నాడు.

''మీరు పెద్దవారయ్యారు. పిల్లలు కోట్లకు పడగలెత్తారు. వారినే ఇక్కడ కొచ్చి స్థిరపడమని చెప్పలేకపోయారే?'' సలహా ఇచ్చాను.

కొంచెం అసంతృప్తి కనిపించిందాయన మొహంలో.

''నా బొంద! అక్కడ నాలుగేళ్లలో సంపాదించేది ఇక్కడ నలభై ఏళ్లకు కూడా సంపాదించలేం. వాళ్లను ఇక్కడకు రమ్మనడం తెలివి తక్కువ. మేమే వెళ్లి రెండు నెలలు ఉండొద్దామనుకుంటున్నాం. ఇంటికి వెనక పక్క పాతిక గజాలు ఖాళీ స్థలం ఉంది. అక్కడ రెండు గదులు వేస్తే ఏదో నాలుగొందలు అద్దె వస్తుంది కదా! పాల ఖర్చైనా వెళ్లిపోతుంది కదా!'' అన్నాడు ఇంజినీరు.

కళ్లు తిరిగి పోయాయి నాకు. ఈయన సంపాదించిన కోట్లకు తోడు కొడుకులు. మనవళ్లు కూడా కోట్లు సంపాదిస్తున్నారు. ఎనభై ఏళ్ల వయసు... నాలుగొందలు అద్దె వస్తుందని... రెండు గదులు వేయిస్తున్నాడు... ఎండలో నిలబడి... చెమటలు కక్కుకుంటూ! వీడు నా కంటే పెద్ద దరిద్రుడు! అక్కడ క్షణం కూడా కూర్చో బుద్ధి కాలేదు నాకు.

ముందుకు సాగుతున్నాను. రైలు కింద పడితే! ప్రాణం వెంటనే పోతుంది. కానీ శరీరం తునా తునకలై పోతుంది. శరీరవయవాలు రెండు మైళ్ల దూరంలో చెల్లా చెదురై పోతాయి! శవం ఆనవాలుండదు. వళ్లు జలదరించింది. అటువంటి చావు చావడం నా వల్ల కానే కాదు.

ఒక పెద్ద బంగళా ముందు ఆ యింటి యజమానురాలు బండి మీద కూరల బేరం చేస్తున్నది. టమోటాలు కిలో మూడు రూపాయలు చెబుతున్నాడు. ఆమె రెండున్నర కడుగుతున్నది. రెండూ ముప్పావలాకు తీసుకోమంటున్నాడు. ఆమె ససేమిరా అంటున్నది. పచ్చిమిర్చి యాభై గ్రాములు తీసుకుంది. రెండు కాయలు కొసరు వెయ్యమంది. వాడు వెయ్య నన్నాడు. వాదన జరుగుతున్నది. 'అయితే నీ మిర్చి అక్కర్లేదు' అని మిరపకాయలు మొత్తం తిరిగిచ్చింది.


దబ్బపండు ఛాయలో ఉండి, కాళికాదేవిలా ఒంటి నిండా నగలు దిగవేసుకుని, రెండు మిరప కాయల కొసరు కోసం గీచి గీచి బేరం చేస్తుంటే నాకు వెన్నులో చలి వేసింది. నా జీవితంలో ఏనాడూ అంత ఘోరంగా బేరాలు చెయ్యలేదు. మైగాడ్! ఈమె నా కంటే పరమ దరిద్రురాలు!!

సులభంగా చావడానికి మార్గాలు ఆలోచిస్తూ నడుస్తున్నాను. పక్కనే హోటల్ కనిపించింది. పర గడుపుతో చస్తే ఆత్మ ఆకలితో అలమటిస్తుందని భావించి కాసిని కాఫీ తాగుదామని హోటల్లో దూరాను.

నా సీటు వెనుక ఇద్దరు పెద్ద మనుషుల మాటలు నన్ను ఆకర్షించాయి. చెవులు రిక్కించి వినసాగాను.

''చలపతీ... నువ్వు పెద్దవాడివై పోయావు. పది తరాలు కూర్చుని తిన్నా తరగని ఆస్తి సంపాదించావు. గుండె పోటు మనిషివి. ఈ పరిస్థితిలో ఉన్న ఒక్కగా నొక్క కొడుకును స్టేట్స్‌కు పంపకపోతేనేం? డబ్బుకేం కొరత ఉంది నీకు? పైగా ఈ మధ్యనే వాడికి పెళ్లి కూడా చేశావు. నీకేదన్నా అయితే వాడు రావడానికే నాలుగు రోజులు పడుతుంది'' అంటున్నాడు ఆయన.

''భద్రం! నీది మరీ చాదస్తం. డబ్బు ఎంతున్నా ఎక్కువ కాదు. స్ట్రోక్ వచ్చి పోతానే అనుకో. చచ్చిన తరువాత ఏమౌతుందో ఎవడికి తెలుస్తుంది? ఎవరో ఒకరు తగలేస్తారు. ఏమౌతుందట? డాలర్ ఉన్నవాడే రాజు. వచ్చిన జీతం అంతా నాకు పంపించాలనే



షరతు మీద పంపిస్తున్నాను. వాడి ఖర్చులకు సాయంత్రం పూట ఏదైనా హోటల్లో పని చేసుకుంటాడు'' సమాధానమిచ్చాడు చలపతి.

కడుపులో దేవినట్లయింది నాకు. పది తరాలు తిన్నా తరగని ఆస్తి కలవాడు. డబ్బుకోసం ఒక్క కొడుకును పరాయిదేశం పంపిస్తున్నాడు. తన శవాన్ని కుక్కలు పీక్కు తిన్నా ఫరవాలేదు. కొత్తగా పెళ్లైన జంటను విడదీయడానికి తెగబడుతున్నాడు. వీడు నిత్య దరిద్రుడు!

వెంటనే లేచి బయటకు వచ్చాను. దారిలో ఒక దేవాలయం కనిపించింది. ఆత్మహత్య మహాపాపం. ఆ పాపాన్ని క్షమించమని దేవుడిని ప్రార్థిద్దామని ఆలయంలోకి వెళ్లాను.

నడివయసులో ఉన్న ఒక జంట దేవుడికి అర్చన చేయిస్తున్నారు. కలకత్తా జామకాయల్లా ఉన్నారు. అణువణువునా ఐశ్వర్యం తాండవిస్తున్నది. బయట ఉన్న ఖరీదైన కారు వారిదే అయి ఉంటుంది.

పూజారి హారతి తెచ్చాడు. రూపాయి నాణెం పళ్లెంలో వేసి హారతిని కళ్లకద్దుకున్నాను.

భర్త తన లాల్చీ జేబులో చెయ్యి దూర్చి గుప్పెడు చిల్లర బయటకు తీశాడు. అందులోంచి ఏరి ఏరి ఐదు నిముషాల తర్వాత పది పైసల బిళ్ల తీసి పళ్లెంలో వేశాడు. పూజారి ముఖం నయాపైసంత అయింది.

మూర్ఛ వచ్చినంత పనైంది నాకు. కనీసం వంద రూపాయల నోటును నిర్లక్ష్యంగా పళ్లెంలో విసురుతాడనుకున్నాను. కనీసం ఆ చిల్లరైనా పోస్తాడనుకున్నాను. పూజారి కూడా పాపం ఆశపడి ఉంటాడు.

బయటకు వస్తుండగా భార్య కోపంగా అంటున్నది. ''ఎందుకు అనవసరంగా వాడి ముఖాన పది పైసలు వేశారు? ఐదు పైసల బిళ్ళలు ఇచ్చాను కదా?''

''వాడి అదృష్టం. ఎంత వెదికినా ఐదు పైసలు కనపడి చావలేదు. బాధగా చెప్పాడు భర్త.

నిలబెట్టి కొంటే పది లక్షల విలువ చేసే ఆ స్త్రీ మాటలు, దానికి భర్త జవాబు విన్న తరువాత ఇంత గర్భ దరిద్రులు ఇలా తలంలో ఉండరనిపించింది.

ఆలోచిస్తున్నాను. అవును. నేనొక్కడినే దరిద్రుడి ననుకున్నాను. కాదు. నాకంటే దరిద్రులు చాలా మంది ఉన్నారు.

ఏసీ రూముల్లో కూర్చుని నెల తిరిగే సరికి వేలకు వేలు జీతాలు తీసుకుంటూ ఐదూ పది రూపాయల కోసం సామాన్య ప్రజలను పీడించే ఉద్యోగులు, కోట్లు సంపాదిస్తూ కార్మికులకు పది రూపాయలు జీతం పెంచని వ్యాపారులు, పదవుల కోసం కన్న తండ్రినే వెన్నుపోటు పొడిచే రాజకీయ నాయకులు, ఎంతో పవిత్రంగా భావించే శీలాన్ని వేషాల కోసం పోగొట్టుకునే సినిమా తారలు, ప్రమోషన్ల కోసం పెళ్లాన్నే తార్చే నీచులు... ఇలా ఎంతో మంది దరిద్రులు ఈ ప్రపంచంలో ఉంటే నేనెందుకు చావాలి?

పుట్టింట్లో అపురూపంగా పెరిగి అత్తగారింట్లో ఆర్థిక ఇబ్బందులు తాళలేక నా భార్య నోరుజారి ఉండవచ్చు. కానీ నన్ను వదిలి వెళ్లాలనుకోవడం లేదు. మరి నేనెందుకు ఆమెను వదిలి పోవాలనుకుంటున్నాను? ఆమెను దిక్కులేని దాన్ని చేసి నేను సాధించేదేముంది?

వెంటనే ఇంటిదారి పట్టాను.